కష్టార్జితం

వి. శ్రీనివాసశాస్త్రి

అక్కడ స్నేహం, బీర్లూ విస్కీ అయి ప్రవహిస్తోంది.

"పెళ్లాం పుట్టింటికెళితే కూడ సెలబ్రేట్ చేసేవాణ్ణి నిన్నే చూస్తా్నా." అభినందిస్తున్నాడో, విమర్శిస్తున్నాడో తెలియకుండా అన్నాడు ప్రకాశం రామారావుతో గ్లాసు నింపుకుంటూ.

"పెళ్ళయిన రెండేళ్ళ తర్వాత కడుపు కాయబట్టి తప్పనిసరై పుట్టింటి కెళ్ళిందిరా నా మిసెస్సు. లేకపోతే అది నన్ను వదల్దు.... పత్తివ్రత్త" అన్నాడు ఒత్తి పలుకుతూ భార్యా అవిధేయుడు రామారావు ప్రకాశం గ్లాసులో ఒంటరి విస్కీకి బీరు తోడు పంపుతూ.

"యు ఆర్ లక్కీ టు హావ్ హర్!" అన్నాడు సుందర్రావు రామారావు భుజం తట్టి.

"మీ ఆవిడ కాయతో వస్తుందా? పండుతోనా? ఏమిటి నీ ప్రిడిక్షను?" పొడుపుకథలాటి ప్రశ్న వదిలాడు జానకిరామ్ సంభాషణలో పాల్గొంటూ.

'కాయ' 'పండు', ఈ రెండు పదాలు అక్కడెవరికీ అంతుబట్టక అంతా మౌనంగా తాగుతూ, తింటూ ఆలోచనలో పడ్డారు.

సంభాషణకి ఆ రకంగా బ్రేక్‌పడి ఓ నిమిషంపాటు తప్పనిసరి నిశ్శబ్దం అక్కడ రాజ్యం ఏలిన తరవాత జానకిరామ్ ప్లేట్లోంచి కోడిమాంసం మెత్తటి ముక్క సెలక్టు చేసుకుని పంటికింద తొక్కిపెట్టి "కాయ అంటే ఆడపిల్లా పండు అంటే మగపిల్లాడు"అని సస్పెన్సు విప్పి, అందర్నీ ఆశ్చర్యపెట్టేసానను కుని గబగబా రెండు గుటకలు విస్కీ మింగి, మర్రొండు మాంసంముక్కలు పంటి క్రిందికి తోశాడు.

అందరూ జానకిరామ్ తెలివితేటలకి సంతోషపడి, ఏదో ఓ జోకు దొరికింది వాడుకుందాం అన్నట్లుగా, గలగల జల జల నవ్వేసేరు.

ఇంక అక్కడికి తన రెస్పాన్సిబిలిటీ తీరిపోయినట్టు జానకిరామ్ మాట్లాడకుండా మౌనముద్ర దాల్చాడు గ్లాసు ఖాళీ చేస్తూ.

*   *   *

హెచ్చు ఖరీదుకి అమ్ముడుపోడానికి

1978 చక్రపాణి నాల్గవ అవార్డు పొందిన కథ

సిద్ధంగా అద్దాల బీరువాలో అందాల గాజు సీసాల్లో భద్రంగా బంధించబడ్డ లడ్డూల కేసి ఆబగా చూసింది సత్తిపండు ఆకలి చూపు.

మూడు రోజులుగా మంచినీళ్లతో నానుతున్న కడుపులో పేగులు కరక
మన్నాయి.

ఏమైనాసరే చేతులకి పనిచెప్పాల్సిం
తప్ప దారిలేదు అనుకున్నాడు వాడు.

జేబులు తడుముకున్నాడు–వాడి కోరి



లన్నింటికీ తిరుగులేని ఆశ - సరికొత్త బ్లేడు భద్రంగా చేతికి తగిలింది.

జేబులు కొట్టడం చాతనైన చాన్నాళ్ళకి-అంటే ఆర్నెల్ల క్రితం - మొదటిసారిగా పోలీసులకి దొరికిపోయింతరవాత పోలీసులు లాకప్‌లో ఒళ్ళు కుళ్ళబొడుస్తుంటే "ఈసారికి ఇడిసిపెట్టండి బాబోయ్ మంచిగా బతుకుతాను బాబోయ్" అని చేతులెత్తి వేడుకున్నాడు తను.

పోలీసులు తన దండాలకి విలువనివ్వలేదు. తమ లాఠీలు ఎంత దుర్మార్గమైనవో రుచిచూపించారు. ఆ తరవాత ఆర్నెల్ల జైలు ఉగ్గబెట్టుకుని ఎలాగో గడిపి 'ఏమైనాసరే జేబులు కొట్టను' అన్న నిర్ణయంతో బైటకొచ్చాడు తను.

ఆ నిర్ణయమే ఈ మూడు రోజులూ తనని ఆకలితో చంపింది. పనిచేసుకు బ్రతకాలనుకున్నా అదంత లాభసాటి

కాదని తేలిపోయింది. అసలు పని దొరకనేలేదు. పని దొరికిన రోజున కడుపుకి చాలినంత దొరకలేదు.

ఒళ్ళిరుసుకుని కడుపు మాడ్చుకోడం కంటే, నాలుగు దెబ్బలుతిన్నా జేబులు కొట్టి తిన్నంత తిని, తాగినంత తాగి ఏ ఫుట్‌పాత్‌మీదో పడుకోవడమే సుఖం అని తెలిసిపోయింది. ఆ సుఖానికి అలవాటుపడ్డ వొళ్ళు, మనసు ఇప్పుడు అటే లాగుతున్నాయి.

వాడి ఆకలి చూపులిప్పుడు అద్దాల బీరువాలో లడ్డుండల నుంచి అప్పుడే వచ్చిన బస్సుగుమ్మం దగ్గర గుమి గూడిన జనంమీద పడ్డాయి. బాగా పలక గల జేబులకోసం వెతికాయి.

అదిగో శిల్కులాల్చీ. తోసుకుని బస్సెక్కుతున్న నల్లరంగు పెద్దమనిషి శిల్కులాల్చీ తప్పనిసరిగా పలుకు తుందన్న ధీమా కలిగింది సత్తిపండుకి.

గబగబా బస్సుగుమ్మందగ్గరకి నడిచి జనాన్ని తోసుకొని బస్సెక్కుతున్నట్టు నటించి శిల్కులాల్చీ ప్రక్కన చేరాడు. అటూ ఇటూ చూసి మెల్లగా చేతులకి పని చెప్పాడు. మరునిమిషంలో బ్లేడు రోడుమీదికిపోగా లాల్చీలో పర్సు జేబులో కొచ్చిపడింది.

బస్సు కదిలింది. గమ్మున సత్తిపండు దిగిపోయాడు.

శిల్కులాల్చీ జేబులు తడుముకుని గగ్గోలుపెట్టి బస్సు ఆపింది.

సత్తిపండు రాగల ప్రమాదం ఊహించిపరుగు లంకించుకున్నాడు.

గోలపెడుతూ రంకెలు వేస్తున్న శిల్కు లాల్చీని అడిగి విషయం తెలుసుకున్న పోలీసు వీరన్న కళ్ళు పారిపోతున్న సత్తిపండుని గుర్తుపట్టేయి.

"ఒరేయ్.... ఆగరా... ఆగు" అంటూ పొలికేకలాంటి పోలీసు కేకవేసి పరుగు తీసాడు వీరన్న.

సత్తిపండు పరుగువేగం పెంచాడు.

జేబులో పర్సు.... అందులో నోట్లు.... అద్దాల బీరువాలో లడ్లు.... జైల్లో కట కటాలు.... లాకప్‌లో దెబ్బలు....

సత్తిపండు పోలీసుకి అందకుండా పరిగెడుతూనే ఉన్నాడు.

* * *

ఇంతకీ గుల్నార్‌లో రంభలాంటి బెంగాలీ లిల్లీలు ముగ్గురు దిగారు. పోదాం అంటావ్. అంతేగా?" జానకిరామ్ మురి పెంగా తాగుతూ లౌక్యంగా అడిగాడు రామారావుని.

"పర్సు పలకటంలేదురా." నీరసంగా అన్నాడు రామారావు.

"అదేంటోయ్ పెద్ద బిజినెస్ మాన్‌వి. మూడు లేత్‌మిషన్ల వర్కుషాప్‌కి సోల్ ప్రొప్రైటరువి. నీ పర్సు పలకకపోవడం ఏమిటి నాన్సెన్సు" అన్నాడు సుందర్రావు.

"నాయనా! నీ పర్సు పలకకపోతే

నెల జీతగాళ్ళం మా పర్సులు పలుకుతాయా" అన్నాడు ప్రకాశం.

అవునని ఒప్పుకున్నాడు రామారావు.

"బిజినెస్సు బాగానే సాగుతుంది కాని లచ్చిందేవి నిలవటంలేదు నా దగ్గర...." అని వాపోయాడు.

"బేపన బిజినెస్సంటే అంతే!" అని తేల్చేడు సుందర్రావు.

అదికూడా తిరుగులేని నెంబరు వన్ జోకనుకుని రామారావుతో సహా తక్కిన ముగ్గురూ నవ్వేసేరు. "బేపన బిజినెస్" గురించి స్వానుభవంతో రామారావు సోదాహరణంగా చిన్న లెక్చరిచ్చాడు.

"బేపనోడు బేపనోడే బిజినెస్సు బిజినెస్సే స్వానుభవం నాయనా స్వానుభవం ఇదిగో చెబుతున్నా విను.... పెళ్ళాం పుట్టింటి కెళ్ళింతరవాత మనసు ఇంటి మీద నిలవక వర్క్‌షాపులోనే కాలం వెళ్ళబుచ్చాను ఈ రెండ్రోజులూ .... దాంతో టర్నర్లు ఒళ్ళొంచి పనిచేసారు. మూడు రోజులు పడుతుందనుకొన్న శ్రీ ఇంజనీరింగ్ కంపెనీవాళ్ళ జాబ్‌వర్క్ దానితో చకచకా రెండురోజులలోనే పూర్తయిపోయింది. టైము కలసి రావడంతో వాళ్లదే రెండో ఆర్డరుకూడా టేకప్‌చేశా. వర్క్ తొందరగా ఫినిషప్ చేసినందుకు శ్రీ కంపెనీ ప్రొప్రయిటరు పటేల్ సంతోషించి బిల్లు వెంటనే పాస్ చేశాడు. అందులో బ్యాంక్‌లోన్ తాలూకు ఇన్‌స్టాల్‌మెంట్ తీర్చేయగా మిగిలింది కొంత భార్యామణికి మనియార్డరు చేయగా తక్కినది ఇదిగో ఇలా మనముందు బీర్ బాటిల్సు, విస్కీ బాటిల్సు రూపంలో.."

"చాల్చాలు.... పెళ్ళాం పుట్టింటి కెళ్ళిన శుభసందర్భంలో పార్టీ ఇస్తూ మధ్యలో రామాయణంలో అదేదో వేట లాగా ఈ సోదంతా ఎందుకు? గుల్నార్ పిలుస్తోంది.... దానిమాటేదో తేల్చు" అని విసుక్కున్నాడు జానకిరామ్.

దాంతో సంభాషణ కులాల మీంచి కేబ్రేడ్సాన్సర్ల మీదికి మళ్ళింది.

ఈలోగా సీసా నాలుగు భాగాలై నలుగురి కడుపుల్లోకి వెళ్ళిపోయింది.

ఇంకో సీసాకి అదేగతి పట్టబోతోంది.

* * *

సత్తిపండు పరుగెడుతూ వచ్చి లాంతరు స్తంభం ప్రక్కన సందు మొగలో గోడకానుకుని నిలబడ్డాడు. భయం భయంగా వెనక్కి చూసాడు.

దూరంగా పరిగెడుతూ వస్తూన్న పోలీసు, ఆ వెనుక శిల్కులాల్చీ, మరెవరో కర్రలతో నలుగురైదుగురు మనుషులూ పిచ్చికుక్క కోసం తరుముతూ వస్తున్నట్లు వస్తున్నారు.

గబుక్కున జేబు తడుముకున్నాడు. జేబులో పర్సు.... అందులో నోట్లు.... కడుపులో ఆకలి.... జైల్లో కటకటాలు... లాకప్‌లో దెబ్బలు ....

సత్తిపండు మళ్ళీ పరుగు పెడు తున్నాడు.

* * *

మిత్రులు ముగ్గురూ కొత్తకొత్త బారుల్లో కొత్తకొత్త డాన్సర్ల వివరాలు ముచ్చటించుకోవడంలో మునిగిపోయి ఉండగా —

బల్లకి చేతులు ఆన్చి అంచుమీద తల పెట్టుకుని సోషొచ్చినవాడిలా పడుకున్న రామారావుకి రెండువందల మైళ్ల దూరంలో పుట్టింట్లో ఆ సమయంలో ఏ అమ్మకో చెల్లికో మొగుడి ముచ్చట్లు చెబుతున్న పతివ్రత పెళ్ళాం గుర్తుకొచ్చింది.

"రా ధీ....నా రా ధీ...."అని ముద్దుగా అనుకున్నాడు భార్యనుద్దేశించి.

"ఇంక తట్టుకోలేను వచ్చేసెయ్.... వచ్చేసెయ్...." అని గొణుక్కున్నాడు.

అతనికి ఓ పెగ్గు ఎక్కువయితే సుందరమైన కలలొస్తాయ్, నతాలు పట్టు తప్పుతాయ్. కోరికలు గుర్రాలవుతాయ్. శరీరం పూలపడవవుతుంది.

కట్టుకున్న పెళ్లాం అరిచి గీపెట్టినా పుట్టింట్లోనే ఉంది తప్ప అందుబాటులో లేదన్ననిజం మనసులో తాండవం చేస్తోంది. గుల్నార్‌లో కొత్తపిట్టలు చూడకుండానే ఊరిస్తున్నాయ్.

ఇన్ని అనుభూతుల మధ్య జేబులో రెండే రెండువందలు తక్కువయిపోయా యన్న బాధ చికాకుపెడుతోంది.

కసిగా బల్లని చేత్తో తట్టాడు.

"రామారావుగాడి కెక్కేసిందిరా ప్రకాశంగా. గురుడు పట్టుతప్పి పోయాడు." అన్నాడు సుందర్రావు. సుందర్రావూ, ప్రకాశం, జానకిరామ్ రామారావుని గట్టిగా పొదివిపట్టు కున్నారు.

* * *

సత్తిపండు పరుగెడుతున్నవాడల్లా ఆగి, దారిపక్క పిట్టగోడదూకి తెరచి ఉన్న దొడ్డి తలుపుగుండా పైన లైట్లు వెలుగుతూ కిందంతా చీకటిగా ఉన్న బంగళా వరండాలోకి వెళ్ళి నోరు తెరచిన పులి బొమ్మచాటున దాక్కున్నాడు.

పోలీసు పరిగెట్టుకుంటూ వస్తే అక్కడికి బూట్లచప్పుడు వినిపిస్తుంది. వాళ్ళు ఆ ఇల్లుదాటి వెళ్ళిపోతే తనకి తెలుస్తుంది. తాను ఈలోగా బైటకి వెళ్ళి గోడదూకి సురక్షితంగా వెళ్ళిపోవచ్చు అనుకున్నాడు.

చీకట్లో కళ్ళు చిట్లించుకుని వరండా లోకి చూసాడు.

కింద ఎవ్వరూ లేనట్టుంది. పైనించి నలుగురైదుగురి మాటలు, నవ్వులూ వినిపిస్తున్నాయ్.

"మళ్ళీ ఇక్కణ్ణించి పారిపోయేలోగా ఎవ్వరూ చూడకపోతే బాగుణ్ణు" అనుకున్నాడు.

* * *

"జగమే మాయా...బ్రతుకే మాయా... జగమే మాయా బ్రతుకే...." రామారావు మెట్లదగ్గిర నిలబడి స్విచ్చికోసం తడిమి అది చేతికి దొరికింతరవాత ఆన్‌చేసి మళ్ళా "జగమే మాయా.... బ్రతుకే



మాయా....” అనుకొంటూ తూలుతూ మెట్లుదిగి పులిబొమ్మచాటున చిరుతపులిని చూసినట్టు అదిరిపడి అనుమానంతో నిలబడిపోయాడు.

సత్తిపండు భయంతో వొణికిపోతున్నాడు. “ఎవర్రా నువ్వు?” అన్న ప్రశ్న రామారావు నోట్లోంచి వీలైనంత కటువుగా వచ్చింది.

కిటికీలోంచి బైటికిచూస్తే పరిగెడుతున్న పోలీసు, కిళ్లీలాల్చీ, చేతిలో కర్రలతో నలుగురైదుగురు వ్యక్తులు కనిపించారు.

రామారావు పోలీసుని చూసినట్టు పసిగట్టిన సత్తిపండు మరింత భయంతో వణికిపోతూ చేతులెత్తి మొక్కేడు.

అంత తాగిన మత్తులోనూ రామారావుకి అంతా అర్థం అయింది.

తలుపు తీసి పోలీసుని పిలిచేడు. “వ్హాట్ హాపెన్డ్?” అని ఆంగ్లంలో అడిగేడు.

“దొంగవెధవ ఎవడో ఈ పక్కన బస్‌స్టాప్‌లో ఈ పెద్దమనిషి జేబు కట్ చేశాడు సార్? ఇలాగే పారిపోయొచ్చాడు,” అంటున్నాడు పోలీసు.

సత్తిపండుకి కళ్లు తిరగడం ప్రారంభించాయి. జైల్లో కటకటాలు.... లాకప్‌లో దెబ్బలు.... భయంతో వొణికిపోతూనే రామారావుకి మరోసారి మొక్కేడు.

రామారావు పోలీసునీ, కిళ్ళీలాల్చీనీ, ఆ వెనుక మనుషుల్నీ పరికించిచూసి “పదినిమిషాలనించీ ఇక్కడే నిలబడ్డాను. ఇటెవరూ పరిగెత్తుకుంటూ రాలేదు....” అన్నాడు.

"ఐతే ఈ పక్కసందులోకి పారి పోయుంటాడెదవ!" అనుకుంటూ పోలీసు శిల్కలాల్చి కర్రలవాళ్లూ ఆ పక్కసందులోకి వెళ్ళిపోయారు

సత్తిపండుకి లోకంలో మంచితనం మీద ఆశ్చర్యం కలిగింది

పులిబొమ్మ చాటునుంచి ఇవతలకి వచ్చి రామారావుకి చేతులు జోడించి నిలబడిపోయాడు

రామారావు సత్తిపండు నోసారి పైనించి కిందికి పరికించిచూసి హఠాత్తుగా మీదికి లంఘించి పులిపంజా విసిరినట్టు మొహంమీద బలంగా గుద్దాడు

గెటవుట్ రాస్కెల్ అరిచావంటే పోలీసులకి అప్పగిస్తాను అని మళ్లా ఛాతీమీద గుద్ది జుట్టుపుచ్చుకుని బైటకీడ్చి మరోసారి దవడమీద కొట్టి మెట్లమీదికి తోసేసి తలుపు బిగించాడు

ఒంట్లో ఆకలికి తిన్న దెబ్బలుతో డై మెట్లమీద కూలిపోయిన సత్తిపండు జేబులు తడుముకున్నాడు కష్టార్జితం చేతకందక గాభరాపడ్డాడు

* * *

మెట్లెక్కుతూ రామారావు గుల్నార్‌లో బెంగాలీలిల్లీ బుగ్గలు ఇదిగో ఇలాగే మెత్తగా దిటంగా ఉంటాయి అనుకున్నాడు చేతిలో పర్సుని ఆప్యాయంగా నిమిరి

టూ హండ్రడ్ ఓన్లీ టూ హండ్రడ్ ఉండకపోతాయా అని ఆత్రంగా నోట్లు లెక్కబెట్టి టూఫిఫ్టీ ఉన్నందుకు సంబరపడిపోయి మనో వేగంతో మెట్లెక్కి "చలో గుల్నార్" అన్నాడు మిత్రులముందు

* * *

మెట్లకింద చీకట్లో సత్తిపండు "దొంగ దొంగ" అని నీరసంగా గొణుగుతున్నట్టు అరుస్తున్నాడు